సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం

RNI APTEL / 2018/76380

# సీమకిరణం

SEEMAKIRANAM TELUGU DAILY


ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రచురణ : కర్నూలు, నెల్లూరు మంగళవారం 24-2-2026 సంపుటి :7 సంచిక :343 ఎడిటర్ : షేక్ నజీర్ అహ్మద్ పేజీలు : 8 వెల : 2-00


# సామాజిక సమానత్వం కోసమే అహర్నిశలూ కృషి

- బలహీన వర్గాల సంక్షేమానికే మా ప్రాధాన్యత
- అసమానతలు తగ్గించడానికే పీ4 కార్యక్రమం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు గతాని కంటే ఎక్కువ కేటాయింపులు
- స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందే బీసీ రిజర్వేషన్లు
- ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి,సీమకిరణం

సామాజిక సమానత్వం కోసమే కూటమి ప్రభుత్వం అహర్నిశలూ కృషి చేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రజల్లో ఆర్థిక అసమానతలు తగ్గించి జనాభా దామాషా ప్రకారం బలహీన వర్గాలు అన్నిటా ప్రాతినిధ్యం వహించేలా సామాజిక సాధికారత సాధించేలా ముందుకు వెళు_న్నామని వెల్లడించారు. బడ్జెట్‌లో సంక్షేమ శాఖల కేటాయింపులపై శాసన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేసిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానిదని అన్నారు. వీటితో పాటు అన్ని వర్గాలకూ మరింత అదనంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు. ఆటో డ్రైవర్ల సేవలో, మత్స్యకారుల సేవలో పథకాలతో పాటు చేనేత కార్మికులకు కూడా ఉచిత విద్యుత్ లాంటి సంక్షేమాన్ని అందించి న్యాయం చేస్తున్నామని అన్నారు. చౌక దుకాణాల ద్వారా వినియోగదారులకు మరింత సమర్థంగా సరకులు అందించేం దుకు ప్రణాళిక చేయటంతో పాటు సక్ర మంగా చేరవేసేందుకు టెక్నాలజీని వినియోగిస్తున్నాం. సంక్షేమ పథకాలను సాంకేతికత సాయంతో అనుకున్న సమయానికే చేరేలా చేస్తున్నాం. ఆర్థిక ఇబ్బందులున్నా రూ.3.32 లక్షల కోట్లతో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టాం. ఈ బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు కేటాయింపులు గతం కంటే పెంచాం. కేటాయించిన మొత్తా లను ఆ వర్గాలకే ఖర్చు చేసేలా చిత్తశుద్ధితో పనిచేస్తాం. సంక్షేమ కార్యక్రమాల ఇవ్వడంతో పాటు ప్రతి వర్గాన్ని బలోపేతం చేసేందుకు బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. ప్రజల ఆదాయాలను పెంచి జీవనప్రమా ణాలు మెరుగుపరుస్తాం. స్వర్ణాంధ్ర 2047 విజన్ నిర్దేశించుకున్నాం. ప్రస్తుతం రూ.3 లక్షలు ఉన్న తలసరి ఆదాయాన్ని 2047 నాటికి రూ.54 లక్షలకు పెంచే నిర్దిష్టమైన లక్ష్యంతో ముందుకెళు తున్నామని ముఖ్యమంత్రి అన్నారు.

**దృష్టంతా భావితరాలపైనే..**


మా దృష్టి అంతా భావి తరంపైనే పెట్టాం. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ప్రాథమిక పాఠశాల వరకూ బలోపేతం చేశాం. రెసిడెన్షియల్ స్కూళ్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి విద్యను అందిస్తున్నాం. పౌష్టికాహారంతో పాటు మెరుగైన ఆరోగ్యాన్ని కల్పించేందుకు కృషి చేస్తున్నాం.

వీటితో సంపద పెరిగి, మెరుగైన వసతులు ఏర్పడినా అసమానతలు తగ్గలేదు. ఆర్థిక తారతమ్యాలు తగ్గించేందుకు పీ4 విధానాన్ని తీసుకొచ్చాం. 10 లక్షల బంగారు కుటుంబాలను 1 లక్ష మంది మార్గదర్శులు దత్తత తీసుకున్నారు. ఏ కార్యక్రమంలోనైనా ఫలితాలు వెంటనే రావు. అసమానతలు తగ్గించేందుకు పీ4 మించి కార్యక్రమం మరొకటి ఉండదు. కొందరికి ఉద్యోగాలు ఉండవు. ఇంకొన్ని వర్గాలు కూలీ పని చేస్తే తప్ప పూట గడవదు. అలాంటి వారిని ఆదుకుని పైకి తీసుకురావాల్సి ఉంది. 2047కు భారత్ అగ్ర దేశంగా తయారవుతుంది. వికసిత్ భారత్‌గా తయారయ్యేనాటికి అసమానతలు ఉండటం మంచిది కాదు. ఇది కేవలం పబ్లిక్ పాలసీల వల్లే సాధ్యం అవుతుంది. చట్టసభల్లో ఉన్న మనమందరం కృత నిశ్చయంతో పని చేస్తే ఇది కష్టం కాదని సీఎం చంద్రబాబు అన్నారు.

# వాట్సాప్ ద్వారా విద్యుత్ సేవలు

## సేవలను సులభంగా చేయాలన్న లక్ష్యం

## టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ




హైదరాబాద్,సీమకిరణం

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) వినియోగదారులకు మరింత సులభమైన సేవలు అందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చింది. విద్యుత్ సేవలను నేరుగా తమ మొబైల్ ఫోన్ ద్వారానే పొందేలా వాట్సాప్ చాట్ సేవలను ప్రారంభించినట్లు టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ వాట్సాప్‌లో 8712441912 నంబర్‌ను సేవ్ చేసుకుని హాయ్ అని మెసేజ్ పంపడం ద్వారా ఫిర్యాదుల నమోదు, బిల్లింగ్ వివరాలు, విద్యుత్ సరఫరా స్థితి, సమాచారం వంటి వివిధ సేవలను సులభంగా పొందవచ్చని తెలిపారు. సైబర్ నేరగాళ్లు పంపించే మెసేజ్‌లకు వాట్సాప్ చాట్‌బాట్ చెక్ పెడుతుందన్నారు సీఎండీ. విద్యుత్ సరఫరాలో ఫిర్యాదుల నమోదుతో పాటు బిల్లు జారీచేయకపోయినా, ఆన్‌లైన్ బిల్లు చెల్లించాక ఆ సమాచారం అప్డేట్ కాకపోయినా, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏవైనా సమస్యలు తలెత్తినా, విద్యుత్ లైన్లకు చెట్లకొమ్మలు తగిలినా, విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నా.. ఇలా పలురకాల ఫిర్యాదులను వాట్సాప్ చాట్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని ఆయన పేర్కొన్నారు.

# పాలకల్తీ మరణాలపై చంద్రబాబు ఆరా

## అధికారులతో సమీక్షించి తక్షణ చర్యలకు ఆదేశం



అమరావతి,సీమకిరణం

రాజమహేంద్రవరంలోని చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్‌లో స్థానికుల అస్వస్థత, మరణాలపై సీఎం చంద్రబాబు ఆరా తీసారు. పాలకల్తీ వ్యవహారంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, వైద్యారోగ్యశాఖ, ఫుడ్ సేఫ్టీ అధికారులతో వర్చువల్‌గా ఆయన సమావేశమయ్యారు. ప్రస్తుతం బాధితులకు అందుతున్న సాయాన్ని సీఎంకు వారు వివరించారు. మెరుగైన వైద్యం అందించాలని చంద్రబాబు ఆదేశించారు. అధికారులు వెంటనే అక్కడికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టాలన్నారు. బాదజతులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని అన్నారు. రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో విక్రయదారులు 106 ఇళ్లకు పాలు పంపిణీ చేశారని అధికారులు వివరించారు

. పాలు వినియోగించిన కుటుంబాల్లోని 73 మంది నుంచి రక్తనమూనాలను సేకరించామని.. మిగి లిన వారివి కూడా సేకరిస్తున్నామని చెప్పారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు పాల నమూ నాలను పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపారని తెలిపారు.

# హెరిటేజ్‌పై బొత్స అసత్య ప్రచారం

## హెరిటేజ్‌పై బొత్స అసత్య ప్రచారం
## ఇందాపూర్ డెయిరీతో ఏం సంబంధం
## మీడియాతో మంత్రి లోకేశ్



అమరావతి,సీమకిరణం

రాష్ట్ర మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ హెరిటేజ్‌పై ఫేక్ ప్రచారం చేశారని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందపూరు డెయిరీకి హెరిటేజ్‌కు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కానీ బొత్స ఇంద్రపూర్ డెయిరీకి.. హెరిటేజ్ కో కంపెనీ అని అసత్య ప్రచారం చేశారని ధ్వజమెత్తారు. అంత సీనియర్ నేతకు కో కంపెనీ అనే

పదం ఉండదనే విషయం తెలియదా? అని నిలదీశారు. ఆయన ఇప్పటికైనా ఇందపూరు డెయిరీ హెరిటేజ్ కో ప్యాకర్ మాత్రమేనని తెలుసుకోవాలని చెప్పుకొచ్చారు.

# రాజమండ్రి కల్తీపాల ఘటన

# ప్రభుత్వ వైఫల్యమేనన్న బొత్స

విజయవాడ,సీమకిరణం



రాజమండ్రిలో కల్తీ పాల ఘటనలో నలుగురు మృతి చెందడం బాధాకరమని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యం కారణంగా జరిగిన ఘటనేనని ఆయన ధ్వజమెత్తారు. ప్రభుత్వ మానటరింగ్ లేనందునే ఈ ఘటన చోటు చేసుకుందన్నారు. శాసనమండలి సమావేశాల్లో భాగంగా సోమవారం మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. అవినీతి పెచ్చుమీరిపోవడమే ఈ కల్తీకి కారణమని మండిపడ్డారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జరిగిన హత్యలుగా భావిస్తున్నామని, పాలను కల్తీ చేసిన వారితో పాటు సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలని బొత్స డిమాండ్ చేశారు. పంటలకు గిట్టుబాటు ధరలేక రైతులు ఇబ్బంది పడుతున్నారని బొత్స మరోసారి స్పష్టం చేశారు. బీఏసీలో మూడు అంశాలపై ప్రస్తావించామని, అందులో రైతులకు గిట్టుబాటు ధర కూడా ఒకటన్నారు. తిరుమల లడ్డూ అంశంపై కూడా చర్చ జరగాలని కోరామని, కారు చౌకగా భూములు కేటాయింపులపై కూడా చర్చకు పట్టుబట్టినట్టి బొత్స పేర్కొన్నారు. చంద్రబాబు కుటుంబం సభ్యులు.. యూనివర్శిటీ పేరుతో విశాఖలో భూములు దోచుకుంటున్నారని మండిపడ్డారు. సభలో వెంకటేశ్వరస్వామి ఫోటోలను చెప్పులు ధరించి పట్టుకున్నట్లు ప్రచురించారని, మండలి చైర్మన్ చూపించిన ఫుటేజ్‌లో ఎలాంటి ఆధారాలు లేవన్నారు.

అందుచేత మొత్తం వీడియో ఫుటేజ్‌ను తమకు ఇవ్వాలని కోరామన్నారు. వాస్తవాలను బయటపెట్టాలని మండలి చైర్మన్‌ను కోరామన్నారు బొత్స.

# దిగుమతులపై సుంకాల విధింపు నిలిపివేత

- సుప్రీం తీర్పుతో దారికొచ్చిన ప్రభుత్వం
- మంగళవారం నుంచి నిలిపివేస్తున్నట్లు వెల్లడి
- అమెరికా కస్టమ్స్ శాఖ ప్రకటన విడుదల




# తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం

- నేడు అసెంబ్లీలో వివరాలు ప్రవేశ పెడతాం
- వైకాపా దేవదేవుడిని రోడ్డుకు లాంగింది మీడియాతో
- చిట్చాట్‌లో మంత్రి లోకేశ్



## సంపాదకీయం

# మాదకద్రవ్యాలపై యుద్ధం ప్రకటించాలి !

మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. అడపాదడపా గంజాయిని, ఇతర మత్తు పదార్థాలను పట్టుకుంటున్నా. .అదేమంత పెద్ద మొత్తంలో కాదని తెలుస్తోంది. చాపకింద నీరులా ఈ వ్యాపారం మూడుపువ్వులు ఆరుకాయలుగా విస్తరిస్తోంది. రోజూ ఎక్కడోచోట దాడుల్లో మత్తు పదార్థాలను పట్టుకుంటూనే ఉన్నారు. అయినా రవాణా ఆగడం లేదు. దొరికిన వారిని ఎన్‌కౌంటర్ చేస్తే తప్ప రవాణా ఆగదేమో అన్న ఆందోళన కలుగుతోంది. నిరుద్యోగులు దీనిని ఓ ఉపాధిగా ఎంచుకోవడం వల్లనే రవాణా సులభంగా మారింది. దీనికితోడు దీంతో డబ్బులు కూడా బాగా రావడంతో యువత దీనిని ఉపాధిగా ఎంచుకుని ఈ ఉచ్చులో దిగుతున్నారు. దీనికి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు కూడా ఓ కారణంగా చూడాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా పెద్ద ఎత్తున ఆపరేషన్ చేపట్టాల్సి ఉంది. యువత పెడమార్గం పట్టకుండా వారికి ఉపాధి చూపాలి. స్కూలుస్థాయిలోనే పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి. కాలేజీల్లో నిఘా పెంచాలి. తెలుగు రాష్ట్రాల్లో ఈగిల్ టీమ్‌లు పనిచేస్తున్నా పరిస్థితికి అడ్డుకట్ట పడడం లేదు. ముఖ్యంగా యువత మత్తుకు అలవాటు పడి దుర్మర్గాలకు దిగుతున్నారు. మత్తు మనిషిలోని విచక్షణను హరించి వేస్తోంది. ఎలాంటి దారుణాలకు దారి తీస్తుందో చెప్పటానికి అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఇటీవల జరిగిన బాలిక హత్యాచార దుర్మార్గం ఓ హెచ్చరిక కావాలి. ఇదొక్కటే కాదు ఇలాంటి ఘటనలు చాలానే జరుగుతున్నాయి. మత్తులో ఓ మైనార్ బాలికను కొందరు సామూహిక అత్యాచచరం చేసారు. అభంశుభం తెలియని పసిపాపను చిదిమేసిన ఘటనలో కులవర్ధన్ అనే దుర్మార్గుడు ఆత్మహత్ చేసుకున్నా సంతోషించడానికి లేదు. నెల్లూరు నగరంలో పట్టపగలే అందరూ చూస్తుండగానే– పెంచలయ్య అనే ప్రజాకళాకారుడిని గంజాయి మూక పొట్టన పెట్టుకొంది. నిజామాబాద్ జిల్లాలో ఎక్సైజ్ శాఖ కానిస్టేబుల్ సౌమ్యను ఈ ఏడాది జనవరిలో మత్తు మాఫియా కారుతో గుద్ది, ప్రాణాలు బలిగొంది. గంజాయికి అలవాటు పడ్డ ముఠాలు హత్యలకు, అత్యాచారాలకు పాల్పడుతున్న దారుణ ఉదంతాలు తరచూ చూస్తూనే ఉన్నాం. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి అంటకాగుతూ ఈ ముఠాలు తమ దౌర్జన్యాలను చెలాయిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యను తీవ్రంగా పరిగణనలోకి తీసుకోవాలి. పైపై చర్యలతో ఈ గంజాయి సామ్రాజ్యం నశించిపోదని గ్రహించాలి. అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని ఒక ఖచ్చితమైన కార్యాచరణ రూపొందించాలి. గంజాయి, ఇతర మాదకద్రవ్యాలతో సంబంధం ఉన్న ముఠాలను పార్టీల నుంచి వెలివేయాలి. రాజకీయ దన్నుతో విర్రవీగుతున్న గంజాయి సామ్రాజ్యాన్ని సామాజికంగా, రాజకీయంగా అన్ని విధాలా ఒంటరిపాటు చేసినప్పుడే ? దాని నియంత్రణ, నిర్మూలన సాధ్యమవుతుంది. ఈ ఘటన యువతలో మార్పు తీసుకుని వస్తుందని అనుకోవడం భ్రమే అవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో మాదక ద్రవ్యాల విచ్చలవిడి వినియోగం ఆందోళన కలిగించేలా ఉంది. దాని నియంత్రణకు,నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నా లాభం లేకుండా పోతోంది. ఉభయ తెలుగు రాస్ట్రాల్లో వరుస ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. వరుసపెట్టి ఈ తరహా దారుణాలు జరుగు తున్నందుకు కఠిన చర్యలు తీసుకోకపోవటం క్షంతవ్యం కాదు. వరుసగా జరుగుతున్న చాలా నేరాల వెనుక మత్తు, మాదకద్రవ్యాలు విపరీతంగా పనిచేస్తున్నాయని ప్రభుత్వాలు గుర్తించాలి. నిందితుల ప్రాణాలు తీసేస్తోనో, జైల్లో వేస్తోనే, లేదా వారే తీసుకుంటేనో ఈ సమస్యకు పరిష్కారం దక్కదు. విస్తరిస్తున్న మాదక ద్రవ్యాల రవాణాను సవాల్‌గా తీసుకోవాలి. కూకటివేళ్లతో సహా పెకలించాలి. దానికి నిరంతరమైన, నిర్దిష్టమైన కార్యాచరణతో ప్రభుత్వాలు నిచేయాలి. అవసరమైతే ఉభయ తెలుగు రాష్ట్రాలు కలిసి పనిచేయాలి. ఇటీవల కాలంలో రాష్ట్రంలోనూ, దేశంలోనూ గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వినియోగం విపరీతంగా పెరిగిందనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. పన్నెండేళ్ల వయసు పిల్లలు మొదలుకొని యువకుల వరకూ ఎక్కువగా వినియోగిస్తున్నట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అందమైన భవిష్యత్తును నిర్మించుకోవాల్సిన విద్యార్థులు మత్తుకు బానిసలై జీవితాలను వ్యర్థం చేసుకుంటున్న ఉదంతాలు కోకొల్లలుగా ఉన్నాయి. మత్తు బానిసలను ఆ ఊబి నుంచి బయటకు తెచ్చే వైద్యానికే దేశంలో ఏటా రూ.15 వేల కోట్ల ఖర్చవుతుందని ఒక అంచనా. చికిత్సకు వెళ్లకుండానే కొందరు మత్తులనే కుప్పకూలి పోతున్నవారు దేశంలో 2003 – 2013 మధ్య పోలీసు తనిఖీల్లో రూ.40 వేల కోట్ల విలువైన 26 లక్షల కేజీల మాదకద్రవ్యాలు పట్టుబడితే– తరువాతి పదేళ్ల కాలంలో అంటే 2014 – 2025 మధ్య కాలంలో రూ.1.65 లక్షల కోట్ల విలువైన కోటి కిలోల మాదకద్రవ్యాలు దొరికాయి. విచ్చలవిడిగా పెరుగుతున్న మత్తు ద్రవ్యాల వినియోగానికి ఈ గణాంకాలు ఒక ఉదాహరణ. దొరికిన మాదకద్రవ్యాలే ఇంత పెద్దఎత్తున ఉంటే దేశమంతా విస్తరించి వినియోగమైనది ఎంత ఉంటుందో ఊహించవొచ్చు! మాదకద్రవ్య వినియోగం తొలుత సరదాగా మొదలై, ఉత్తేజం ఇస్తున్నట్టుగా అనిపించి, తరువాత మనిషి సర్వ శారీరక వ్యవస్థలనూ నిర్వీర్యం చేస్తుంది. మత్తుకు బానిసయ్యేలా మార్చేసి, విచక్షణను, వివేచనను చంపేస్తుంది. సామాజిక కట్టుబాట్లను, నాగరిక విలువలను కాలదన్ని, మనిషిని మృగంలా మార్చేస్తుంది. ఫలితంగా తీవ్రమైన నేరాలూ, దారుణాలు చోటు చేసుకుంటున్నాయి. మాదకద్రవ్యాల కారణంగా ఎన్నో కుటుంబాలు అస్తవ్యస్త మవుతున్నాయి. ముఖ్యంగా నైజీరియాన్స్ వీసా గడవువ ముగిసినా ఇక్కడే తిష్టవేసి మత్తు వ్యాపారం చేస్తున్నారు. వీరిని ముందుగా గుర్తించాలి. మత్తు పదార్థాల రవాణను అరికట్టేందుకు ఆపరేషన్ చేపట్టాల్సిందే. ఇందుకోసం పెద్ద ఎత్తున బలగాలను వినియోగించాలి.

# దిగుమతులపై సుంకాల విధింపు నిలిపివేత

వాషింగ్టన్,ఫిబ్రవరి23:

దిగుమతులపై సుంకాల విధింపును మంగళవారం నుంచీ నిలిపి వేయనున్నామని అమెరికా కస్టమ్స్ శాఖ తాజాగా ఒక ప్రకటనలో తెలిపింది. ఆర్థిక ఎమర్జెన్సీ పేరిట ట్రంప్ ప్రభుత్వం విధిస్తున్న సుంకాలు చెల్లవంటూ అమెరికా సుప్రీం కోర్టు ఇటీవల తీర్పునిచ్చిన నేపథ్యంలో యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్స్ ప్రొటెక్షన్ శాఖ ఈ ప్రకటన విడుదల చేసింది. ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకనమిక్ పవర్స్ చట్టం కింద సుంకాల వసూళ్లను నిలిపివేస్తున్నట్టు తెలిపింది. అమెరికా కాలమానం ప్రకారం, మంగళవారం అర్ధరాత్రి 12.01 నుంచి ఇది అమల్లోకి వస్తుందని పేర్కొంది.సుప్రీం కోర్టు తీర్పు వెలువడిన మూడు రోజులకు కస్టమ్స్ శాఖ ఈ ప్రకటన విడుదల చేసింది.

వెంటనే సుంకాల వసూలును ఎందుకు నిలిపివేయలేదో చెప్పలేదు. ఇప్పటివరకూ వసూలు చేసిన సుంకాల డబ్బును రీఫండ్ చేయడంపై కూడా క్లారిటీ ఇవ్వలేదు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిగుమతులపై కొత్తగా 10 శాతం కనీస సుంకాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా దాన్ని 15 శాతానికి పెంచారు. ఐఈఈపీఏ చట్టానికి బదులు వాణిజ్య చట్టం–1 974లోని సెక్షన్ 122 కింద సర్‌చార్జ్ పేరిట ఈ సుంకాలకు తెరతీశారు. అయితే, అమెరికా చట్టసభల అనుమతి లేనిదే వీటిని కూడా 150 రోజులకు మించి పొడిగించే అవకాశం లేదు. ఇక జాతీయ భద్రత పేరిట స్టీల్, అల్యూమినియం, సెమీకండక్టర్స్, ఆటో రంగాలపై గతంలో విధించిన సుంకాలనూ ట్రంప్ కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో శాశ్వత ప్రాతిపదికన సుంకాలు విధించేందుకు మార్గాలను అన్వేషించాలని వాణిజ్య విభాగానికి ఆయన సూచించినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇకపోతే సుంకాల విధింపు చెల్లదంటూ అమెరికా సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వానికి కొత్త చిక్కులు మొదలయ్యాయి. సుంకాల వల్ల ఇప్పటివరకూ అధిక ధరలు చెల్లించిన అమెరికన్ కస్టమర్లు తమకు రీఫండ్స్ కావాలని పట్టుబడుతు న్నారు. ఈ జాబితాలో ట్రంప్ రాజకీయ ప్రత్యర్థు లతో పాటు కార్పొరేట్ కంపెనీలు కూడా ఉన్నాయి. అయితే, ఈ ప్రక్రియ అంత సులభం కాదని అక్కడి నిపుణులు చెబుతున్నారు.

తాను విధించిన సుంకాల భారం విదేశీ ఎగుమతిదారులపై తప్ప సామాన్య అమెరికన్లు, అమెరికా దిగుమతి దారులపై లేదని ట్రంప్ ఇప్పటివరకూ చెబుతూ వచ్చారు. అయితే, ఆయన రాజకీయ ప్రత్యర్థులు మాత్రం ఈ వాదనతో మొదటి నుంచీ విభేదిస్తున్నారు. అధిక సుంకాల భారాన్ని సామాన్య అమెరికన్లే భరించాల్సి వచ్చిందని మండిపడేవారు. ఇక సుప్రీం తీర్పు తరువాత ఇల్లినాయ్ రాష్ట్ర గవర్నర్ సుంకాల రీఫండ్స్ కోరుతూ ట్రంప్‌నకు బిల్లులు పంపించారు. సుంకాల కారణంగా తమ రాష్ట్రం 9 బిలియన్ డాలర్లు అధికంగా చెల్లించాల్సి వచ్చిందని అన్నారు. తమ రాష్ట్రంలోని ఒక్కో కుటుంబంపై సగటున 1,700 డాలర్ల అదనపు భారం పడిందని అన్నారు. ఇక కార్పొరేట్ కంపెనీలు కూడా రీఫండ్స్‌కు సిద్ధమవుతున్నాయి. కాస్ట్‌కో, రెవ్లాన్ వంటి పలు సంస్థలు ఇప్పటికే కేసులు దాఖలు చేశాయి. ఇప్పటివరకూ ట్రంప్ ప్రభుత్వం సుంకాల పేరిట 133 బిలియన్‌ల నుంచి 175 బిలియన్ డాలర్ల మేర వసూలు చేసి ఉంటుందని అమెరికా వర్గాలు భావిస్తున్నాయి. సుంకాల డబ్బులో ఎంతో కొంత తిరిగిస్తామని ట్రంప్ వర్గం ఇప్పటికే పలుమార్లు తెలిపింది. అయితే, ఇది అంత ఆషామాషీ వ్యవహారం కాదని అక్కడి నిపుణులు చెబుతున్నారు. సామాన్య ప్రజలకు నేరుగా రీఫండ్స్ అందే అవకాశాలు తక్కువని ట్రెజరీ సెక్రెటరీ స్కాట్ బెస్సెంట్ కూడా పేర్కొన్నారు. రీఫండ్స్‌లో అధికభాగం దిగుమతిదారులు, అమెరికన్ కంపెనీలకే వెళుతుందని చెబుతున్నారు. విదేశీ ఉత్పత్తుల దిగుమతి సమయంలో వీరే కస్టమ్స్ శాఖకు నేరుగా సుంకాల రూపంలో అధిక ధరలను చెల్లించారని వివరిస్తున్నారు. రీఫండ్స్ పక్రియ కూడా సంక్లిష్టంగా ఉంటుందని ఇప్పటికే జస్టిస్ ఏమీ కోనీ బేరెట్, జస్టిస్ బ్రెట్ కేవనా హెచ్చరించారు. ఈ విషయంలో కోర్టు కేసులు కొలిక్కి వచ్చేసరికి రెండు నుంచి నాలుగేళ్ల సమయం పడుతుందని ట్రంప్ కూడా ఇటీవల ఓ సందర్భంలో స్వయంగా అంగీకరించారు.

వేల కొద్ది దిగుమతిదారుల రిఫండ్స్ అభ్యర్థనలను పరిశీలించడం కస్టమ్స్ శాఖకూ భారంగా మారుతుందని అంటున్నారు.

ఇక అంతర్జాతీయ స్థాయిలో కూడా ట్రంప్ సర్కారు పలు కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాణిజ్య నిపుణులు చెబుతున్నారు. న్యూయార్క్ ఫెడ్, జేపీ మోర్గన్, కీల్ ఇన్‌స్టిట్యూ?ట్ అంచనా ప్రకారం, కస్టమ్స్ శాఖ వసూలు చేసిన సుంకాల్లో 90 నుంచి 96 శాతం అమెరికన్ల జేబుల్లోంచే వెళ్లాయి. భారత్, చైనా, మెక్సికో లాంటి దేశాలు తమ ఉత్పత్తుల ధరల తగ్గింపు రూపంలో 4–10 శాతం మాత్రమే సుంకాల భారాన్ని భరించాయి.

# సుబ్రహ్మణ్యస్వామికి సుప్రీంకోర్టులో చుక్కెదురు

ఏకసభ్య కమిషన్ విచారణపై పిటిషన్ కొట్టివేత

కల్తీ నెయ్యి వ్యవహారంలో దర్యాప్తునకు మార్గమం సుగమం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి23 మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంపై ఏపీ ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను నియమించడాన్ని సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ ఓవర్ లాపింగ్ కిందకు రాదని.. పరిపాలనాపరమైన లోపాల గుర్తింపునకు ఏర్పాటు చేసిందని సీజేఐ ధర్మాసనం పేర్కొంది. కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంపై దర్యాప్తు కోసం సుప్రీంకోర్టు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటుచేసినా దానికి అతీతంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విచారణ కమిషన్,కమిటీని ఏర్పాటుచేయాలని ఈ నెల 3వ తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించడాన్ని సవాలుచేస్తూ మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలుచేశారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై దర్యాప్తు కోసం సుప్రీంకోర్టు ప్రత్యేక సిట్ ఏర్పాటుచేసినా దానికి అతీతంగా కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిషన్/కమిటీని ఏర్పాటుచేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. సోమవారం సుబ్రహ్మణ్యస్వామి పిటిషన్‌ను కొట్టివేసింది.తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగం వ్యవహారంలో ఏక సభ్య కమిటీ ఏర్పాటుపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిటీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ అంశంపై సోమవారం విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం ఈ మేరకు తీర్పు వెలువరించింది. శ్రీవారి లడ్డూ వ్యవహారంపై సీబీఐ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఇచ్చిన నివేదికపై రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేశ్ కుమార్ ఆధ్వర్యంలో ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో



బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్య స్వామి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ కేసులో ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, సీనియర్ న్యాయవాది సిద్దార్థ్ లూథ్రాతో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. సిట్ నివేదికను పరిశీలించి.. పరిపాలనా లోపాలు, టెండర్ అవకతవకలు, బాధ్యులను గుర్తించడానికే ఈ కమిటీని నియమించినట్లు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లింది ప్రభుత్వం. అలాగే సీబీఐ సిట్ విచారణకు ఎలాంటి ఆటంకం ఉండదని స్పష్టం చేసింది. దీంతో

## గౌరవెల్లి ప్రాజెక్ట్‌కు లీగల్ సమస్యలు

ప్రాజెక్ట్ ఆలస్యానికి అదే కారణం

సచివాలయంలో సమీక్షించిన మంత్రులు ఉత్తమ్,పొన్నం

హైదరాబాద్,ఫిబ్రవరి23

అనేక కారణాలు, లీగల్ సమస్యల వల్ల గౌరవెల్లి ప్రాజెక్టు..ఆలస్యం అవుతుందని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ ప్రాజెక్టుపై మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్.. సచివాలయంలో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ ప్రాజెక్టు కాలువల భూసేకరణ పూర్తి చేసి పనులు వేగవంతం చేసేలా సమీక్షా సమావేశంలో చర్చించారు. తమ మీద ఒత్తిడి తీసుకొస్తున్నారని తెలిపారు. సిద్దిపేట, కరీంనగర్, హనుమ కొండ మూడు జిల్లాల కలెక్టర్‌లు, రాష్ట్ర అడ్వకేట్ జనరల్, ఇరిగేషన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించామని అన్నారు.

# తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం

అమరావతి,ఫిబ్రవరి23 తిరుమలో కొలువుదీరిన దేవదేవుడికి జరిగిన మహాపచారం అసెంబ్లీ వేదికగా బయటపెడతామని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. శ్రీవారి లడ్డూ కల్తీకి సంబంధించిన వాస్తవాలన్నీ మంగళవారం అసెంబ్లీలో పెడతామని తెలిపారు. సోమవారం అసెంబ్లీ లాబీలో నిర్వహించిన ఇష్టాగోష్ఠిలో మంత్రి లోకేశ్ మాట్లాడారు. సభకు రావడం సభ్యులుగా వారి బాధ్యత అంటూ వైసీపీ ఎమ్మెల్యేలకు ఆయన సూచించారు. అసెంబ్లీకి రమ్మని ఎవ్వరూ బొట్టుపెట్టి పిలవరంటూ ఈ సందర్భంగా వారికి చురకలంటించారు. దేవుడిని సైతం వైసీపీ రోడ్డు మీదకు తీసుకురావడం బాధాకరమన్నారు. దేవుడి ఫొటోలతో చట్టసభల్లో ర్యాలీలు చేయడం అభ్యంతరకరమని లోకేశ్ వ్యాఖ్యానించారు. జగన్ ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించినట్లు ఆరోపణ వెల్లువెత్తాయి. దీనిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు సంస్థ(సిట్)ను ఏర్పాటు చేసింది. ఈ నివేదికను ఇటీవల ప్రభుత్వానికి అందజేసింది సిట్. అయితే ఈ వ్యవహారంలో తమ తప్పేమీ లేదంటూ వైసీపీ నేతలు వ్యాఖ్యలు చేస్తున్నారు. అంతేకాకుండా.. కూటమి ప్రభుత్వం తమపై అసత్య ప్రచారం చేస్తోందంటూ వైసీపీ నేతలు తీవ్రంగా స్పందిస్తున్నారు. అసెంబ్లీ లాబీలో మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు లోకేశ్ తనదైన శైలిలో సమాధానమిచ్చారు. తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీకి సంబంధించిన వాస్తవాలను అసెంబ్లీలో మంగళవారం



ప్రవేశపెడతామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. దేవదేవుడికి జరిగిన మహాపచారం అసెంబ్లీ వేదికగానే బయటపెడతామన్నారు. అసెంబ్లీకి రమ్మని ఎవరూ బొట్టుపెట్టి పిలవరని వైకాపా ఎమ్మెల్యేలను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. సభకు రావటం సభ్యులుగా వారి బాధ్యత అని గుర్తుచేశారు. దేవుడిని కూడా వైకాపా నేతలు రోడ్డు మీదకు తీసుకురావవడం బాధాకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవుడి ఫొటోలతో చట్టసభల్లో ర్యాలీలు ఆక్షేపణీయమన్నారు.

సీమకిరణం
SEEMAKIRANAM TELUGU DAILY
జాతీయ తెలుగు దినపత్రిక
మంగళవారం 24-2-2026

# అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేసేంత వరకు పోరాటం ఆగదు

## సిఐటియు ఆధ్వర్యంలో ఎమ్మార్వో కార్యాలయం దగ్గర రిలే నిరాహార దీక్షలు






డోన్ టౌన్, ఫిబ్రవరి 23,(సీమ కిరణం న్యూస్): అంగన్వాడీ లకు వేతనాల పెంపు గ్రాట్యూటీ పిఎఫ్ ఈఎస్ఐ అమలు తదితర గత 42 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం మినిట్స్ రూపంలో ఇచ్చిన హామీలను అమలు చేసేంతవరకు పోరాటం ఆగదని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి.శేభారాణి,సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు బిమాణిక్యం శెట్టి,టి.శివరాం,జిల్లా ఉపాధ్యక్షులు వై.ఎల్లయ్య స్పష్టం చేశారు.రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మార్వో కార్యాలయం ఎదుట సోమవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు.సిఐటియు పట్టణ ఉపాధ్యక్షులు నక్కీ శ్రీకాంత్,సిఐటియు మండల నాయకులుపి .రామాంజనేయు లు, సిఐటియు ప్యాపిలి మండల కార్యదర్శి చిన్న రెహమాన్ పాల్గొన్నారు.ముందుగా కార్యక్రమానికి సిఐటియు పట్టణ అధ్యక్షులు బి.మాణిక్యం శెట్టి అధ్యక్షత వహించగా నాగలక్ష్మి సుమలత గుల్జార్టీ మంజుల జ్యోతి కళావతి వరలక్ష్మి లక్ష్మీదేవి లకు జిల్లా అధ్యక్షురాలు శేభారాణి పూలమాలలు వేసి మొదటి రోజు రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు.అనంతరం నాయకులు మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని పెండింగ్ లో ఉన్న 1810 మినీ వర్కర్లకు క్వాలిఫికేషన్ రిలాక్సేషన్ ఇచ్చి మెయిన్ సెంటర్లుగా మార్చాలని గ్రాట్యూటీ అమలు చేయాలని వేతనంతో కూడిన మెడికల్ లీవులు ఇవ్వాలని అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని హెల్పర్ల ప్రమోషన్లకు నిర్దిష్టమైన గైడెన్స్ రూపొందించి అమలు చేయాలని పెండింగ్ లో ఉన్న 164 సూపర్వైజర్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని మే నెల అంతా వేసవి సెలవులు ఇవ్వాలని లబ్ధిదారులకు నాణ్యమైన బియ్యం ఆయిల్ కందిపప్పు అందించాలని మెనూ చార్జీలు పెంచాలని ఉచితంగా గ్యాస్ సరిపరా చేయాలని ఫ్రీ స్కూల్ బలోపేతం చేయాలని ఫ్రీ స్కూల్ పిల్లలకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరూ అంగన్వాడి సెంటర్లలో ఉండే విధంగా జీవో ఇవ్వాలని ఫ్రీ స్కూల్ పిల్లలకు సాయంత్రం స్నాక్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో 42 రోజులు సమ్మె చేసినప్పుడు ప్రతిపక్ష నేతగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మేము అధికారంలోకి వస్తే పై సమస్యలన్నింటినీ పరిష్కారం చేస్తామని వారు కూడా హామీ ఇవ్వడం జరిగిందని అయితే అధికారంలోకి వచ్చిన ఈ రెండు సంవత్సరాల కాలంలో సమస్యలు పరిష్కరించాలని అనేక రకాలుగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని ప్రభుత్వం మాత్రం స్పందించడం లేదని ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ప్రాజెక్టు కేంద్రాలలో మూడు రోజులపాటు 26 27 జిల్లా కలెక్టర్ కార్యాలయాల దగ్గర రిలే నిరాహార దీక్షలు కొనసాగుతాయని అప్పటికి పరిష్కారం కాకపోతే మార్చి 2న చలో విజయవాడ కార్యక్రమంతో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షులు సులోచనమ్మ నాయకులు రహమద్ బి లక్ష్మీశ్వరి యశోద ఐద్వా నాయకురాలు షమీం బేగం 100 మంది అంగన్వాడీలు పాల్గొన్నారు.

# దళితులపై దాడులను సహించం

- దళితులపై దాడులను అరికట్టాలి
- ఎమ్మార్పీఎస్ నాయకులు గిడ్డయ్య
- దళితులపై దాడులను తీవ్రంగా
- ఖండించిన ఎమ్మార్పీఎస్ నాయకులు గిడ్డయ్య



వెల్దుర్తి, ఫిబ్రవరి 23, (సీమకిరణం న్యూస్) : దళితులపై దాడులను సహించబోమని దళితులపై దాడులను వెంటనే అరికట్టాలని వెల్దుర్తి ఎమ్మార్పీఎస్ నాయకులు గిడ్డయ్య అన్నారు.కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం స్థానికంగా దళితులపై ఆగడాలను ఖండిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు గిడ్డయ్య విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోనీ పలు ప్రాంతాలలో గతంలో దళితులపై దాడులు నిర్వహించారు. ప్రస్తుతం కర్నూలు జిల్లాలో దళితుడిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ కూటమి ప్రభుత్వానికి బీసీలు మరియు మైనార్టీలు దళితులు అందరి సహకారంతో మేము ముందంజలో ఉంటున్నాము.

కనుక కూటమి ప్రభుత్వం నాయకులు దళితులపై ఆగడాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకొని రాష్ట్రం ఎటువంటి ఫ్యాక్షనిజానికి లోను కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలీస్ అధికారులు దళితులయితేనేమి మరియు వేరే వర్గాలైతేనేమి తప్పు చేసినచో ఎవరైనా శిక్షించాల్సిన అవసరం ఉందన్నారు. కనుక ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా, ఫ్యాక్షనిజం ఉద్రిక్తం కాకుండా పోలీస్ అధికారులు ఇరువురి మధ్య తగు సూచనలు తెలిపి సానుకూల దృక్పథంతో ఎటువంటి సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

# పోలీస్ అధికారి సునీల్ కుమార్‌కు చుక్కెదురు

## సస్పెన్షన్ పొడిగించిన ప్రభుత్వం



అమరావతి,ఫిబ్రవరి23 సీనియర్ ఐపీఎస్ అధికారి పి.వి. సునీల్‌కుమార్ సస్పెన్షన్‌ను ప్రభుత్వం జూన్ 30వరకూ పొడిగించింది. ఆయనపై ఉన్న కేసుల దృష్ట్యా పవీవిరమణ వరకు ఇక విధుల్లో చేరే అవకాశం లేకుండా పోయింది. ఈ నెల 24 నాటికి ఆయన సస్పెన్షన్ గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ నేతృత్వంలో 18న భేటీ అయిన రివ్యూ కమిటీ ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చించింది. అగ్రిగోల్డ్ నిధుల దుర్వినియోగంతో పాటు అప్పటి వైసీపీ ఎంపీ, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజును కస్టడీలో హింసించిన కేసుల్లో సునీల్ కుమార్‌పై విచారణ కొనసాగుతోంది. వీటితో పాటు ప్రభుత్వం తీసుకున్న క్రమశిక్షణ చర్యలపై సోషల్ మీడియా వేదికగా ఆయన వ్యాఖ్యలు చేసిన అంశంపై విచారణాధికారి తన నివేదికను సమర్పించాల్సి ఉంది.ప్రస్తుతం నాలుగు కేసుల్లో ఆయనపై విచారణ జరుగుతున్నందున సస్పెన్షన్ ఎత్తివేస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని దర్యాప్తు అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా రివ్యూ కమిటీ అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఆయన సస్పెన్షన్‌ను తొలగించడం సబబు కాదని ప్రభుత్వానికి నివేదిక అందించింది. ఆయనపై ఉన్న క్రిమినల్ ప్రొసీడింగ్స్ పూర్తయ్యే వరకూ లేదా పదవీ విరమణల్లో ఏది ముందైతే అప్పటి వరకూ సస్పెన్షన్‌లో కొనసాగించాలని కమిటీ చేసిన సిఫారసులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు సీఎస్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా విదేశీ పర్యటనలకు వెళ్లారన్న ఆభియోగాలపై సునీల్‌కుమార్‌ను ప్రభుత్వం తొలుత 2025 మార్చి 2న సస్పెండ్ చేసింది. అప్పటి నుంచీ ఆయన సస్పెన్షన్‌లో ఉన్నారు.

## రఘురామకృష్ణరాజును కస్టోడియల్ టార్చర్ కేసు

### బీహార్‌లో ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ అరెస్ట్



అమరావతి,ఫిబ్రవరి23 రఘురామకృష్ణరాజును కస్టోడియల్ టార్చర్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎంపీ, ప్రస్తుత ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజును కస్టడీలో వేధించినట్లు నమోదైన 'థర్డ్ డిగ్రీ' కేసులో కేసులో విచారణ ఎదుర్కొంటున్న ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ ను బీహార్‌లో ఏపీ పోలీసులు అరెస్టు చేశారు. బీహార్ కేడర్‌కు చెందిన సునీల్ నాయక్.. వైసీపీ హయాంలో డిప్యూటేషన్‌పై సీఐడీలో పనిచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన బీహార్ వెళ్లిపోయారు. రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసులో సునీల్ పాత్రపై ఫిర్యాదు చేయడంతో విచారణకు రావాలని ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరైన సీనియర్ ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్‌ను ఆంధ్రప్రదేశ్ పోలీసులు బిహార్‌లోని పట్నాలో అదుపులోకి తీసుకున్నారు. గత కొంతకాలంగా ఈ కేసులో విచారణకు హాజరుకావాలని పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ, ఆయన స్పందించకపోవడంతో పోలీసులు ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు.

# వైభవంగా సాగుతున్న యాదాద్రి బ్రహ్మోత్సవాలు

## గోవర్ధనగిరిధారిగా దర్శనమిచ్చిన నారసింహుడు

యాదగిరిగుట్ట,ఫిబ్రవరి23 యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజైన సోమవారం యాదగిరీశుడిని 'గోవర్ధనగిరిధారి' అలంకరణలో భక్తులు సేవించారు. భక్తజన రక్షణెళి ధ్యేయంగా అవతారాలు దాల్చిన స్వామివారు ప్రకృతి బీభత్సం నుంచి కాపాడే భక్తజన బాంధవుడిగా శ్రీకృష్ణుడి లీలలను ప్రతిబింభించే అలంకరణలో దివ్య మనోహరంగా భక్తజనులకు దర్శనమిచ్చారు. తన చిటికెన వేలుతో గోవర్ధన పర్వతాన్ని ఎత్తిపట్టి గోపాలులను రక్షించిన మహిమలను అర్చకులు అలంకార విశిష్టతను భక్తులకు వివరించారు.భక్తుల గోవిందనామ స్మరణల మధ్య వైభవంగా ఊరేగించారు. ఉత్సవాలను ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు, భట్టర్ సురేంద్రాచార్యులు, అర్చక బృందం, వేదపడింతులు, రుత్వికులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారు సింహ వాహనం పై ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఆలయ అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నర్సింహమూర్తి, ఈవో భవాని శంకర్, డీఈవో దోర్భల భాస్కరశర్మ, ఏఈవోలు, పర్యవేక్షకులు, ఉద్యోగ, సిబ్బంది, భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు.

# పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

## ఎస్సై నాగార్జున







ప్యాపిలి ఫిబ్రవరి 23 (సీమ కిరణం న్యూస్ ) ఇంటర్మీడియట్ పరీక్షలు సోమవారం నుండి ప్రారంభమైన నేపథ్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల వద్ద ప్యాపిలి ఎస్ఐ నాగార్జున తన సిబ్బందితో 144 సెక్షన్ అమలును పర్యవేక్షించారు. ఈ నెల 23 నుండి మార్చ్ 18 వరకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు (సెక్షన్ 144) అమల్లో ఉంటుందని ఎస్సై నాగార్జున తెలిపారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు పోలీస్ వారికి సహకరించి నిబంధనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు పరీక్షా కేంద్రాల వద్ద గుమికూడరాదనీ, నిషేధిత వస్తువులతో పరీక్షా కేంద్రాల వద్ద సంచరించరాదనీ, పరీక్షా కేంద్రం నుండి 200 మీటర్ల పరిధిలో ఉన్న జిరాక్స్ సెంటర్లు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు మూసివేయాలనీ ఆయన పేర్కొన్నారు. ఎస్ఐ వెంట ఏఎస్ఐ మురళి కృష్ణ, కానిస్టేబుల్ రహమతుల్లా రమణ, రమణ, హోంగార్డ్ శేషు, సచివాలయ మహిళా పోలీస్లు ఉన్నారు.అలాగే ఇంటర్ మొదటి సంవత్సరం 166 మంది విద్యార్థులు ఉండగా 148 మంది హాజరైనారని, 18 మంది విద్యార్థులు గైర్ హాజరయ్యారని చీఫ్ సూపరిండెంట్ ముస్తాక్ అహ్మద్, డిపార్ట్మెంటల్ అధికారి చౌడప్ప పత్రికముకంగా తెలిపారు.

# న్యాయమైన కోరిక తీరే వరకు దీక్ష కొనసాగుతుంది




వెల్దుర్తి, ఫిబ్రవరి 23, (సీమకిరణం న్యూస్) : వెల్దుర్తి ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్ అసోసియేషన్ యూనియన్ ఆధ్వర్యంలో వెల్దుర్తి ఎమ్మార్వో కార్యాలయం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. వెల్దుర్తి అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్ అసోసియేషన్ యూనియన్ కార్యకర్తలు రేణుక మహేశ్వరి షబానా సరస్వతి సుజాత రిలే నిరాహార దీక్షలు చేపట్టారు.

ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్ అసోసియేషన్ యూనియన్ కర్నూలు జిల్లా అధ్యక్షురాలు ఎస్ చాందిని ఆధ్వర్యంలో ఎమ్మార్వోకి ఎండిఓకి వినతి పత్రం అందజేశారు. చాందిని మాట్లాడుతూ గతంలో 42 రోజుల నిరాహార దీక్ష చేపట్టినప్పుడు ప్రతిపక్షంలో ఇప్పుడు ఉన్న టీడీపీ , కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మీ న్యాయమైన కోరికలకి మేము పూర్తి మద్దతు తెలుపుతామన్నారు. కానీ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాల అవుతున్న ఎలాంటి హామీ నెరవేర్చలేదు కాబట్టి మా న్యాయమైన కోరికలు తీరేంతవరకు ఈ రిలే నిరాహార దీక్ష కొనసాగుతుంది.

ఈదీక్షకు మద్దతుగా ఏపీ భవన కార్మిక నిర్మాణ యూనియన్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు జి నాగమద్దయ్య సంఘీభావం తెలిపినారు. వెల్దుర్తి ప్రాజెక్ట్ కార్యదర్శి సుజాత సంధ్యారాణి మాట్లాడుతూ ఈరోజు సాయంత్రం చర్చలకు జరపాలని నిర్ణయించినారు మానాయమైన కోరికలు అనుగుణంగా లేకుంటే ఈ రిలే దీక్షలు ఇలాగనే కొనసాగిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. భవన నిర్మాణ జిల్లా అధ్యక్షుడు నాగ మద్దయ్య మాట్లాడుతూ వీరి కష్టం తగ్గట్టు వారు వేతనాలు పెంచాలని అడుగుతున్నారు. అదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు వెల్దుర్తి క్రిష్ణగిరి మండలాలు అంగన్వాడీ టీచర్స్ అందరూ పాల్గొన్నారు. ఏఐటీయూసీ వెల్దుర్తి మండల అధ్యక్షుడు మాధవస్వామి అనిల్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# డోన్ బీజేపీ నాయకులు సునీల్ రెడ్డి కి ఘన స్వాగతం




డోన్ టౌన్, ఫిబ్రవరి 23,(సీమ కిరణం న్యూస్):పట్టణంలోనే 44వ జాతీయ రహదారి ఆనుకొని ఉన్నటువంటి డోన్ బైపాస్ మ్యాక్స్ ఫోర్ హోటల్ దగ్గర ఈరోజు సోమవారం బిజెపి యువ నాయకుడు రాజ్ పుత్ కమలేష్ ఆధ్వర్యంలోఘన స్వాగతం పలికిన డోన్ బీజేపీ నాయకులు ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి గణేష్, , బిజెపి యువమోర్చా జిల్లా నాయకులు విజయభాస్కర్, అరుణ్ కుమార్ ముదిరాజు లక్ష్మీనారాయణ, విశ్వకర్మ ఇంప్లిమెంటేషన్ నెంబర్ ఆర్మీ రామయ్య పాల్గొనడం జరిగినది. అనంతరం ఈ సందర్భంగా రాష్ట్ర బిజెపి యువ మోర్చా అధ్యక్షుడు సునీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ నాయకులు కార్యకర్తలు అందరూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందేవిధంగా కృషి చేయాలని ప్రజా అభివృద్ధికి తోడ్పాటు అందిస్తూ పార్టీ బలోపేతం చేయాలని డోన్ బీజేపీ నాయకులకు సూచించడం జరిగినది. అదేవిధంగా పార్టీ కార్యక్రమంలో కష్టపడి పనిచేయాలని అదేవిధంగా పార్టీలో అందరినీ కలుపుకొని పోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# సమంత.. 'మా ఇంటి బంగారం' రిలీజ్ డేట్ ఫిక్స్




సౌత్ స్టార్ హీరోయిన్ సమంత  లీడ్ రోల్‌లో నటిస్తూ నిర్మించిన చిత్రం మా ఇంటి బంగారం ఓ బేబీ, అలా మొదలైంది చిత్రాల ఫేమ్ నందిని రెడ్డి (దర్శకత్వం వహించారు. సమంత పెళ్లి చేసుకున్న అనంతరం షూటింగ్ ప్రారంభించిన ఈ చిత్రం చిత్రీకరణ ముగింపు దశలో ఉంది. ఈ నేపథ్యంలో ఇటీవల విడుదల చేసిన టీజర్ ఓ రేంజ్‌లో ఆడియన్స్‌ను ఆకట్టుకుని సినిమా ఎప్పుడు విడుదల అవుతుందా అని ఎదురు చూసేలా క్యూరియాసిటీని పెంచేసింది. అయితే.. తాజాగా ఈ మూవీ విడుదల తేదీని ప్రకటిస్తూ మేకర్స్ కీలక అప్డేట్ ఇచ్చారు. సినిమాను వేసవి సెలవుల దృష్ట్యా మే 15న థియేటర్లకు తీసుకు వస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ క్రమంలో ఆ పోస్టర్ సైతం రిలీజ్ చేశారు

# మెడ ముట్టుకుంటే.. పవన్ ఫ్యాన్స్‌కు పూనకాలే!




'ఆరా ఆఫ్ ఉస్తాద్'.. పాట వచ్చేసింది హరీశ్ శంకర్  కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్ ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ మరో నెల రోజుల్లో ప్రేక్షకుల ఎదుటకు రానుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే విడుదల చేసిన సాంగ్, పోస్టర్లు, గ్లింప్స్ సినిమాపై అంచనాలను ఆకాశానికి తీసుకెళ్లాయి. సినిమా బుక్స్‌కాగా తాజాగా ఆదివారం ప్రత్యేక ఈవెంట్ నిర్వహించి ఈ చిత్రం నుంచి మెడ ముట్టుకుంటే.. తొడ కొట్టినట్లే, జుట్టు ఎగురుతుంటే.. ఇక దడ దడ పిడుగులు పడినట్టే అంటూ పవన్ మేనరిజమ్‌ను చూపుతూ ఉషారెత్తించేలా పాట సాగింది. ఈ పాటకు అస్కార్ విన్నర్ చంద్రబోస్‌సాహిత్యం అందించగా దేవీ శ్రీ ప్రసాద్  స్వీయ సంగీతంలో ఎస్పీ అభిషేక్  తో కలిసి ఆలపించారు. ప్రస్తుతం ఈ పాట యూట్యూబ్‌లో దుమ్ము దులిపేస్తోంది.

# ఎందుకు పనిచేయలేదు..



బాలీవుడ్‌లో ఉన్న మల్టీ టాలెంటెడ్ ఫిల్మ్ మేకర్స్‌లో టాప్‌లో ఉంటాడు ఇంతియాజ్ అలీ. ఈ స్టార్ డైరెక్టర్ నుంచి వచ్చిన సూపర్ హిట్ చిత్రాల్లో ఒకటి జబ్ వీ మెట్ (ఝుఎ ఔవ వీవ్). రొమాంటిక్ కామెడీ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రంలో కరీనాకపూర్, షాహిద్ కపూర్ లీడ్ రోల్స్‌లో నటించారు. కల్ట్ ఫేవరేట్ సినిమాల లిస్టులో టాప్‌లో ఉండే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ట్రెండ్ సెట్ చేసిందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇందులో కరీనాకపూర్ పోషించిన గీత్ పాత్రను అభిమానులు ఇప్పటికీ సెలబ్రేట్ చేసుకుంటుంటారు. అయితే జబ్ వీ మెట్ తర్వాత మళ్లీ కరీనాకపూర్‌తో ఎందుకు కలిసి పనిచేయడం లేదనే ప్రశ్నకు ఆసక్తికర సమాధానమిచ్చాడు ఇంతియాజ్ అలీ. అంతటి బలమైన కథ మళ్లీ దొరకలేదన్నాడు. 'నేను ప్రయత్నించా. కానీ ఎప్పుడూ కరీనాకపూర్‌కు ఆఫర్ చేసేలా.. ఆమె ఒప్పుకునేంత అలాంటి పాత్ర నాకు ఎప్పుడూ దొరకలేదు' అన్నాడు ఇంతియాజ్ అలీ. సరైన కథ దొరకకపోవడం వల్లే ఐకానిక్ పెయిర్ మళ్లీ కలిసి పనిచేసే అవకాశం రాలేదని ఇంతియాజ్ అలీ రియాక్షన్‌తో అర్థమవుతోంది.

# డ్రెస్సింగ్ వివాదం మళ్లీ రగిలింది..

హీరోయిన్ల డ్రెస్సింగ్‌పై సీనియర్ నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలు మరోసారి సోషల్ మీడియాలో చర్చకు దారి తీశాయి. ఆ వ్యాఖ్యలకు పరోక్షంగా స్పందించినట్లు కనిపించిన నిధి అగర్వాల్ తాజా పబ్లిక్ అప్పియరెన్స్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల జరిగిన 'దండోరా' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో శివాజీ మాట్లాడుతూ, హీరోయిన్లు పబ్లిక్ ఈవెంట్లకు వెళ్లేటప్పుడు కాస్త ట్రెడిషనల్‌గా డ్రెస్సులు ధరించాలని సూచించారు. కొన్నిసార్లు అభ్యంతరకరమైన డ్రెస్సింగ్ కారణంగా అభిమానులు అత్యుత్సాహంగా ప్రవర్తించే అవకాశముందని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. మహిళల దుస్తులను కారణంగా చూపించడం సరైంది కాదని పలువురు నెటిజన్లు, సినీ ప్రముఖులు అభ్యంతరం వ్యక్తం చేశారు. విమర్శలు పెరగడంతో శివాజీ ఆ తర్వాత స్పందిస్తూ, తన మాటల వల్ల ఎవరైనా నొచ్చుకుని ఉంటే క్షమించాలని తెలిపారు. ఎవరినీ తప్పుబట్టాలన్న ఉద్దేశం తనకు లేదని, ఈవెంట్లలో ఎలాంటి అసౌకర్యకర ఘటనలు జరగకూడదనే ఉద్దేశంతోనే చెప్పానని వివరణ ఇచ్చారు. ఆ సందర్భంలో గతంలో హైదరాబాద్‌లోని లులు మాల్‌లో నిధి అగర్వాల్ ఎదుర్కొన్న ఘటనను కూడా ప్రస్తావించారు. అలాగే సమంతకు ఈవెంట్లలో ఎదురైన ఇబ్బందులను గుర్తు చేశారు.

శివాజీ వ్యాఖ్యల అనంతరం నిధి అగర్వాల్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో చేసిన పోస్ట్ చర్చనీయాంశమైంది. బాధితురాలినే నిందించడం సానుభూతి కాదని, అలాంటి వ్యాఖ్యలు తప్పుదోవ పట్టిస్తాయని ఆమె పేర్కొన్నారు. ఎవరినీ నేరుగా ఉద్దేశించకపోయినా, ఆ పోస్ట్ శివాజీ కామెంట్స్‌కు కౌంటర్‌గా భావిస్తూ నెటిజన్లు చర్చించుకున్నారు. ఇదిలా ఉండగా నిధి రీసెంట్‌గా ఫిలిం ఫేర్ అవార్డ్స ఈవెంట్‌కు స్టైలిష్ మోడ్రన్ డ్రెస్‌లో హాజరైన వీడియో వైరల్ అవుతోంది. దీంతో "డ్రెస్సింగ్‌తోనే సమాధానం ఇచ్చింది" అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. మహిళలు ఏ దుస్తులు ధరించాలో అది వారి వ్యక్తిగత ఎంపికేనని, దానిని తప్పుబట్టడం సరికాదని పలువురు మద్దతు తెలుపుతున్నారు. శివాజీ మాత్రం తన ఉద్దేశం ఎవరినీ విమర్శించడం కాదని మరోసారి స్పష్టం చేశారు.




# జోర్డాన్ షెడ్యూల్ పూర్తి

**ఎన్టీఆర్--ప్రశాంత్ నీల్ మూవీ తదుపరి షెడ్యూల్ హైదరాబాద్‌లో..!**

నందమూరి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న జూనియర్ ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. తాజాగా ఈ చిత్ర బృందం జోర్డాన్‌లో కీలక షెడ్యూల్‌ను పూర్తి చేసింది. ముందుగా రూపొందించిన ప్లాన్ ప్రకారం మార్చి 6 వరకు జోర్డాన్‌లో షూటింగ్ కొనసాగాల్సి ఉండగా, ప్రధాన యాక్షన్ సీక్వెన్స్‌లను విజయవంతంగా పూర్తి చేసినట్లు సమాచారం. ప్రశాంత్ నీల్ స్టైల్‌కు తగ్గట్టుగా భారీ స్థాయిలో రూపొందించిన ఈ యాక్షన్ బ్లాక్స్‌లో ఎన్టీఆర్ అదిరిపోయే ప్రదర్శన ఇచ్చినట్లు చిత్ర యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ సన్నివేశాలు సినిమాకు ప్రధాన హైలైట్‌గా నిలుస్తాయని, 'నెవర్ బిఫోర్ -- ఎవర్ ఆఫ్టర్' స్థాయిలో ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తాయని టాక్ వినిపిస్తోంది.

అయితే యాక్షన్ సీక్వెన్స్‌లకు అనుసంధానంగా ఉండే కొన్ని లింక్ సీన్స్ చిత్రీకరణలో స్వల్ప ఇబ్బందులు ఎదురయ్యాయి. జోర్డాన్‌లో అవసరమైన జూనియర్ ఆర్టిస్టులు అందుబాటులో లేకపోవడం, కొన్ని లాజిస్టిక్ సమస్యలు తలెత్తడంతో మేకర్స్ ప్లాన్‌లో మార్పులు చేశారు. అక్కడే వేచి ఉండటానికి బదులుగా, మిగిలిన సన్నివేశాలను హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో లేదా పరిసర ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసే సెట్స్‌లో పూర్తి చేయాలని నిర్ణయించారు. దీంతో ముందుగా అనుకున్న తేదీ కంటే ముందుగానే, ఈ నెల 25న చిత్ర యూనిట్ హైదరాబాద్‌కు తిరిగి రానుంది. షూటింగ్‌లో ఇలాంటి మార్పులు స ఎ ా జ వ ే ం అయినప్పటికీ, సినిమా నాణ్యత విషయంలో దర్శకుడు ప్రశాంత్ నీల్ ఎక్కడా రాజీ పడకుండా జాగ్రత్తలు తీనుకుంటున్నారని తెలుస్తోంది. ప్రతి సన్నివేశం అత్యుత్తమంగా రావాలనే ఉద్దేశంతోనే ఈ మార్పులు చేసినట్లు సమాచారం. భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న ఈ చిత్రం ఎన్టీఆర్ అభిమానులకు పక్కా మాస్ ట్రీట్‌గా నిలుస్తుందని సినీ వర్గాలు విశ్వసిస్తున్నాయి.




# అయేషా ఖాన్ పేరుతో ఫేక్ వాట్సాప్ అకౌంట్లు..

బాలీవుడ్ బ్యూటీగా గుర్తింపు పొందిన అయేషా ఖాన్ ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. ఇటీవల విడుదలైన ధురందర్ సినిమాలో ఒక స్పెషల్ సాంగ్‌లో కనిపించి మంచి పాపులారిటీ సంపాదించుకున్న ఆమెకు ఫాలోయింగ్ గణనీయంగా పెరిగింది. అయితే, ఈ క్రేజ్‌ను కొంతమంది సైబర్ నేరగాళ్లు దుర్వినియోగం చేస్తున్నట్లు బయటపడింది.

అయేషా ఖాన్ పేరుతో నకిలీ వాట్సాప్ అకౌంట్లు సృష్టించి, పలువురిని సంప్రదిస్తూ మోసాలకు పాల్పడుతున్న ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ విషయం ఆమె దృష్టికి చేరడంతో వెంటనే స్పందించింది.

తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో ఓ పోస్టు పెట్టిన అయేషా, ఫేక్ అకౌంట్‌కు సంబంధించిన వాట్సాప్ చాట్ స్క్రీన్‌షాట్‌లను షేర్ చేసింది. "ఇది నా అకౌంట్ కాదు. దయచేసి ఇలాంటి మెసేజ్‌లను నమ్మకండి" అంటూ స్పష్టంచేసింది. అంతేకాకుండా ఆ నకిలీ అకౌంట్‌కు సంబంధించిన ఫోన్ నంబర్‌ను కూడా వెల్లడించింది. ఇలాంటి మోసపూరిత చర్యల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత వివరాలు లేదా డబ్బు పంపకూడదని ఆమె సూచించింది. ప్రస్తుతం ఆమె చేసిన ఈ పోస్టు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

అభిమానులు కూడా ఆమెకు మద్దతుగా కామెంట్లు చేస్తున్నారు. అయేషా ఖాన్ కేవలం హిందీ చిత్రాల్లోనే కాకుండా తెలుగు సినిమాల్లో కూడా నటించింది. ముఖ ఛిత్రంతో టాలీవుడ్‌లో అడుగుపెట్టిన ఆమె, తరువాత మనమే, ఓం భీం బుష్, లక్కీ భాస్కర్, గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి లాంటి సినిమాల్లో నటించింది. ఇటీవల వచ్చిన ధురంధర్ సినిమాలో ఐటెం సాంగ్ ద్వారా మరింత గుర్తింపు తెచ్చుకుంది.

# నిరాశపర్చిన రాజాసాబ్..

**పీపుల్ మీడియా ఫ్యాక్టరీకిప్రభాస్ మరో ఛాన్స్.. !**



గ్లోబర్ స్టార్ యాక్టర్ ప్రభాస్ రీసెంట్‌గా రాజాసాబ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడని తెలిసిందే. టాలీవుడ్ టాప్ లీడింగ్ బ్యానర్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ తెరకెక్కించిన ఈ చిత్రం బాక్సాఫీస్ ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఇంప్రెస్ చేయలేకపోయింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ మూవీ పీపుల్ మీడియా ఫ్యాక్టరీకి నిరాశనే మిగిల్చిందని చెప్పాలి.

ఇదిలా ఉంటే ప్రభాస్ మరోసారి ఇదే బ్యానర్‌లో సినిమా చేసేందుకు రెడీ అవుతున్నాడన్న వార్త ఒకటి నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఫెయిల్యూర్ తర్వాత ప్రభాస్ నిర్మాత టీజీ విశ్వప్రసాద్‌ను కలిసి మరో సినిమా చేస్తానని హామీనిచ్చాడట. బాక్సాఫీస్ ఫలితాలతో సంబంధం లేకుండా ప్రభాస్ తీసుకున్న ఈ నిర్ణయం మరోసారి తన గొప్ప మనసును చాటుతోంది. ప్రభాస్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ రీయూనియన్ ప్రాజెక్టుకు సంబంధించి త్వరలోనే అధికారిక ప్రకటన రాబోతుందట. మరి ఈ సినిమాను డైరెక్ట్ చేయబోయేది ఎవరో..? ప్రభాస్ స్టార్‌డమ్‌కు తగ్గకుండా ఎలివేట్ చేసేలా ఈ కొత్త ప్రాజెక్టు ఉండాలని ఆశిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఎప్పుడెప్పుడు అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఉంటుందా..? అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు మూవీ లవర్స్. ప్రభాస్ ఖాతాలో ప్రస్తుతం సలార్ 2తోపాటు ఫౌజీ, స్పిరిట్ సినిమాలున్నాయి.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2O18/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com